మళ్లీ జగనన్నకే పట్టం


రాజుపాలెంలో జగనన్నే మా భవిష్యత్తు నిర్వహిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు కోటేశ్వరరావు

కొత్తపట్నం: మా జీవితానికి భవిష్యత్తు ఇచ్చిన జగనన్నకే పట్టం కడతామని జనం అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కేవలం సంక్షేమ పథకాలతో ఆధారపడి జీవిస్తున్న ప్రజలు మీకు అండగా ఉంటామని ధైర్యాన్ని ఇస్తున్నారు. రాజుపాలెం ఎంపీటీసీ సభ్యుడు ఉప్పుటూరి నాగరాజు ఆధ్వర్యంలో మంగళవారం జగనన్నే మా భవిష్యత్తు మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజా సర్వే చేపడుతున్నారు. వీరికి లబ్ధిదారులు ఆప్యాయంగా ఆహ్వానం పలుతున్నారు. ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరండంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనే గెలిపించుకుంటామని నమ్మకంగా చెబుతున్నారు. ఇంటి యజమాని అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను గోడలపై, సెల్‌ఫోన్లపై సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, వలింటీర్లు కలిసి అంటించారు. సచివాలయ కన్వీనరు, మండల అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ సామంతుల చంద్రశేకర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు గోల్కొండ సుబ్బారెడ్డి, అనీల్‌కుమార్ రెడ్డి, గృహ సారథులు ద్వారం హేమంత్ కుమార్‌రెడ్డి, కుంకాల సురేంద్రరెడ్డి, యూత్‌వైస్ ప్రెసిడెంట్ అప్పల నాగరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మాజీ మంత్రి శిద్దాను సత్కరించిన ఆర్యవైశ్యులు


మాజీ మంత్రి శిద్దాను సత్కరిస్తున్న ఆర్యవైశ్యులు

ఒంగోలు: మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ నాయకులు శిద్దా రాఘవరావును రాజమండ్రికి చెందిన ఆర్యవైశ్యులు మంగళవారం ఆయన నివాసంలో కలిసి స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించారు. రాజమండ్రిలో నూతనంగా నిర్మిస్తున్న ఆర్యవైశ్య వసతి గృహం ఏర్పాట్లపై చర్చించారు. శాంతి ఫైప్స్ ప్రొప్రయిటర్ తవ్వా రాజా, ఆర్యవసతి గృహ అధ్యక్షులు కె.కనకేష్, కాంట్రాక్టర్ గోపాలకృష్ణ, వెంకటేష్, సుభాష్, ప్రభాత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి తిరునాళ్ల


కల్యాణంలో పాల్గొన్న ఎంపీపీ దంపతులు

దొనకొండ: స్థానిక అడ్డరోడ్డు ఆనంద ఆశ్రమంలో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ తిరునాళ్ల మంగళవారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. దాతల సహకారంతో వీరబ్రహ్మేంద్ర స్వామి నవమ వార్షికోత్సవం వైశాఖ శుద్ధ పంచమి రోజు జరుపుకుంటున్నారు. గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర, గోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి, ఈశ్వరీదేవి, సిద్ధమూర్తి, అన్నపూర్ణ, కాశీ విశ్వేశ్వర, నందీశ్వర, సీతా సమేత శ్రీరామ చంద్రమూర్తి, లక్ష్మణ అభయాంజనేయస్వామి, పోలేరమ్మ, కాశినాయన, ఆదిత్యాది నవగ్రహ దేవతల నవమ వార్షికోత్సవ మహోత్సవం సందర్భంగా భక్తులు పూజలు చేశారు. ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి దంపతులు స్వామి వారి కల్యాణం జరిపించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భైరవానందస్వామి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

నేడు, రేపు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ కేంద్రాలు

పెద్దారవీడు: ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ కోసం 26, 27వ తేదీల్లో మండలంలో నాలుగు ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ నాసర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. 26వ తేదీన పుచ్చకాయలపల్లె సచివాలయంలో సుంకేసుల, కలనూతల, పుచ్చకాయలపల్లె, గొబ్బూరు సచివాలయంలో దేవరాజుగట్టు, గొబ్బూరు, 27వ తేదీన బద్వీడుచెర్లోపల్లె సచివాలయంలో పెద్దారవీడు, సానికవరం, బి.చెర్లోపల్లె, తోకపల్లె సచివాలయంలో తోకపల్లె, తంగిరాలపల్లె, కంభంపాడు, మద్దలకట్ట, బోయిదగుంపుల, చట్లమిట్ల గ్రామాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేంద్రాలు పని చేస్తాయని, ఆధార్ కేంద్రాల్లో నమోదు చేసే అంశాలు 0-5 ఏళ్ల పిల్లలకు ఆధార్ కార్డు నమోదు, పేరు, చిరునామా, పుట్టిన తేదీ, ఫొటో, ఈ మెయిల్ మార్పు చేయుట, ఫోన్ నంబర్ లింక్, వేలిముద్రను అప్‌డేట్, కలర్ ప్రింట్ డౌన్‌లోడ్ చేయడం లాంటివి చేసుకొనే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని పేర్కొన్నారు.

'మాకు రక్షణ కల్పించండి'

- పోలీసులను ఆశ్రయించిన మృతుడి కుటుంబ సభ్యులు

ఒంగోలు టౌన్: తన తండ్రి మృతికి కారకుడైన న్యాయవాది నుంచి తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని ఎనమదుల వివేక్ సుమిత్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మామిడిపాలేనికి చెందిన ఎనమదుల సురేంద్రబాబు ఈనెల 18వ తేదీ రాత్రి స్కూటీపై బైపాస్ రోడ్డులో వెళ్తుండగా త్రోవగుంట నుంచి బుల్లెట్‌పై వేగంగా వస్తున్న న్యాయవాది వల్లూరి బాల అంబరీష్ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సురేంద్ర మరణించారు. అప్పుడు పెద్దల సమక్షంలో మీ కార్యక్రమాలు పూర్తయిన తర్వాత మా ఇంటికి రండి.. సహాయం చేస్తాను అని చెప్పారు. ఆయన మాట ప్రకారం కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి కోర్టు సెంటర్లోని లాయర్ నివాసానికి వెళ్లగా కులం పేరుతో దూషించడమే కాకుండా దాడి చేసేందుకు ప్రయత్నించారు. తమను చంపుతామని బెదిరించారంటూ వివేక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మగడ్డి సాగుతో లాభాలు

మార్కాపురం టౌన్: నిమ్మగడ్డి సాగుతో రైతులు లాభాలు పొందవచ్చని మార్కాపురం ఉద్యాన శాఖాధికారి రమేష్ పేర్కొన్నారు. ఆరోమ మిషన్ ఫేజ్-3లో భాగంగా మంగళవారం రాయవరం, నాయుడుపల్లి గ్రామాల్లో నిమ్మగడ్డి పండించే రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. సుగంధ ద్రవ్యాల సాగులో పరివర్తనాత్మక మార్పులు వచ్చాయని, రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు ఉన్నత స్థాయి శాస్త్రవేత్తలతో మే రెండో వారంలో జిల్లా స్థాయి సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి పావణేశ్వరి పాల్గొన్నారు.

బొర్రా పోరాట జీవితం ఆదర్శనీయం


బొర్రా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఒంగోలు టౌన్: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అవిశ్రాంతంగా పోరాడిన ప్రజా ఉద్యమకారుడు బొర్ర పూర్ణచంద్రరావు నేటి తరానికి ఆదర్శనీయుడని ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు అన్నారు. ఎన్జీ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు బొర్రా పూర్ణచంద్రరావు 5వ వర్ధంతి మంగళవారం మల్లయ్య లింగం భవనంలో జరిగింది. సభకు పంచాయతీరాజ్ విశ్రాంత ఎస్‌ఈ ఆవుల సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. నల్లూరి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం 1984లో ఉద్యోగ సంఘాలన్నిటినీ ఏకం చేసి 52 రోజుల పాటు సమ్మె నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. నిస్వార్థంగా సామాజిక ఉద్యమాలకు అండగా నిలిచిన బొర్రా స్ఫూర్తితో ఉద్యోగ, ప్రజా సంఘాల నాయకులు ముందుకు నడవాలని సీపీఎం సీనియర్ నాయకులు వై.సిద్దయ్య కోరారు. జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షులు నుందూరి రంగారావు, ఓపీడీఆర్ రాష్ట్ర నాయకులు చావలి సుధాకర్, సీపీఐ నాయకులు ఎస్డీ సర్దార్, ఎన్జీ నాయకులు అడకా స్వాములు, అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షులు బొట్ల రామారావు, రచయిత కత్తి కళ్యాణ్, రెడ్‌స్టార్ జిల్లా నాయకులు బి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. తొలుత బొర్రా చిత్రపటానికి నివాళి అర్పించారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి


సభలో ప్రసంగిస్తున్న పెద్దన్న

ఒంగోలు టౌన్: ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వీఆర్‌ఏ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.పెద్దన్న డిమాండ్ చేశారు. మంగళవారం ఒంగోలులోని సీఐటీయూ కార్యాలయంలో జరిగిన గ్రామ రెవెన్యూ సహాయకుల జిల్లా 8వ మహాసభల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రకాశం జిల్లాలో 500 మంది నామినీలుగా విధులు నిర్వహిస్తున్నారని, నామినీలను వీఆరేలుగా నియమిస్తానని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. కారుణ్య నియామకాలు చేపట్టాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు పెంచాలని కోరారు. భూముల సర్వేలో పాల్గొన్న వీఆర్‌ఏలకు తక్షణమే అలవెన్సులు ఇవ్వాలని జిల్లా గౌరవాధ్యక్షులు గంటెనపల్లి శ్రీనివాసులు కోరారు. సభలో సంఘం జిల్లా నాయకులు పి.వివేకానంద, సీఐటీయూ నాయకులు కె.సుబ్బారావు, జి.వి కొండారెడ్డి తదితరులు ప్రసంగించారు. అనంతరం 35 మందితో నూతన కమిటీని ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. కార్యదర్శులుగా పి.యాకోబు, పాటడుగు వివేకానంద, కోశాధికారిగా వై.చిన్నబ్బాయి ఎన్నికయ్యారు.

ఘనంగా శంకర జయంతి


చీమకుర్తి: స్వామి వారిని ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

ఒంగోలు టౌన్: నగరంలోని కేశవస్వామి పేటలో వేంచేసియున్న శ్రీ గంగా సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం శంకర జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు ఆలయంలో ఉన్న ఆదిశంకరాచార్యుల విగ్రహానికి విశేషంగా అభిషేకం నిర్వహించారు. శంకరాచార్యులతో పాటు శ్రీకాశీ విశ్వేశ్వర స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, అన్నపూర్ణదేవికి కుంకుమార్చన కార్యక్రమాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం ఆది శంకరాచార్యులకు సహస్ర నామ అష్టోత్తర శతనామావళి పూజ జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈఓ డి.రజనీ కుమారి, దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, సభ్యులు కుర్రా ప్రసాద్ బాబు, అర్చక స్వాములు ప్రసాద్ శాస్త్రి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి: మండల స్థాయి విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం చీమకుర్తిలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారి ప్రతిష్టా వేడుకలతోపాటు అష్టోత్తర పూజా కార్యక్రమాలను నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు గోనుగుంట చంద్రశేఖర్, స్థానికులు పాల్గొన్నారు.

దోమలు ఉత్పత్తి కాకుండా చర్యలు తీసుకోండి


మలేరియా వ్యాధిపై ర్యాలీ నిర్వహిస్తున్న కొత్తపట్నం పీహెచ్ వైద్య సిబ్బంది

కొత్తపట్నం: దోమలు ఉత్పత్తి కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కొత్తపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ పి.హేమంత్ కుమార్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా వైద్యాధికారుల ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ కూడలి వరకు అక్కడ నుంచి శివాలయం వీధి, పోస్టాఫీసు బజారు వరకు ర్యాలీ నిర్వహించారు. హేమంత్ కుమార్ మాట్లాడుతూ దోమలు పుట్టకూడదు, కుట్టకూడదు అనే అంశం గురించి వివరించారు. దోమలు ద్వారా మలేరియా, టైఫాయిడ్ వివిధ రకాల విష జ్వారాలు వస్తాయన్నారు. ఇంటి చుట్టూ నీటి గుంతలు లేకుండా, దోమలు గుడ్లు పెట్టి అవకాశం ఉండకూడదన్నారు. దోమ తెరలు, పొగ వచ్చే క్యాండిల్స్ వాడుకోవాలని సూచించారు. సీహెచ్‌వో ఓంకార్, సూపర్ వైజర్లు వినయకుమారి, ఎమ్మెలేలమ్మ, ప్రభాకర్, పీహెచ్‌ఎస్ ఇందిరాదేవి, ఎంఎల్‌హెచ్‌పీ యామిని, ఏఎస్‌ఎంలు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన గూడేల్లో వైద్యశిబిరం

యర్రగొండపాలెం: మండలంలోని పాలుట్ల పీహెచ్‌సీ పరిధిలోని గిరిజన గూడేల్లో సార్క్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అల్లిపాలెం, గాంధీనగర్, శాంతి నగర్, దద్దనాల చెంచు గూడేల్లో ఉన్న గర్భిణులు, చిన్న పిల్లలకు రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సార్క్ సంస్థ ఏపీఎం ఎస్‌ఎం కృష్ణ, ఏఎస్‌ఏసీవో మరియబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో వైఎస్సార్ సీపీ నాయకుడు మృతి

గిద్దలూరు రూరల్: గిద్దలూరు పట్టణానికి చెందిన ఆర్యవైశ్య నేత, వైఎస్సార్ సీపీ నాయకుడు, ఎల్ఐసీ ఏజెంట్ కోటా శ్రీను మంగళవారం గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు.. కోటా శ్రీను కుటుంబాన్ని పరామర్శించి ఆయన మృతదేహానికి పూల మాలలు వేసి నివాళలర్పించారు.

ఎక్కువైన కుక్కల బెడద

కంభం: పట్టణంలో కుక్కల బెడద రోజు రోజుకూ పెరిగిపోతోంది. మంగళవారం స్థానిక జామియా మసీదు సెంటర్లో పాఠశాలకు వెళ్లి వస్తున్న 6వ తరగతి విద్యార్థిని సయ్యద్ జుహేదాపై కుక్క దాడి చేసి గాయపరిచింది. కంభం, కందులాపురం పంచాయతీ పరిధిలో రోజుకు ఒకరిద్దరు కుక్కల దాడికి గురవుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోక పోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

మౌలిక వసతులు యాప్‌లో పొందుపరచాలి

దర్శి: పాఠశాలల్లో మౌళిక వసతులను యాప్‌లో పొందుపరచాలని ఎంఈఓ కాకర్ల రఘురామయ్య సూచించారు. స్కూల్ పెర్ఫార్మెన్స్ టూల్‌పై ఒక రోజు శిక్షణ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. రఘురామయ్య మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలంటే సమస్యలు యాప్‌లో పేర్కోవడం అవసరమన్నారు. స్టేట్ రిసోర్స్ పర్సన్‌లు రవీంద్ర, శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా విశ్లేషించేందుకు ఉపయోగ పడే విధానమే మూల్యాంకణమన్నారు. ఖాదర్ మస్తాన్, ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై చెన్నకేశవస్వామి


ఉత్సవంలో చెన్నకేశవస్వామి

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్ల గ్రామంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి, పార్వతి సమేత రాజనగరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వేడుకగా నిర్వహిస్తున్నారు. మంగళవారం స్వామివారు హనుంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ ఉభయదాతలుగా కోడూరి, బొర్రా కుటుంబాలకు చెందిన దంపతులు వ్యవహరించారు. వేదపండితులు నంద్యాల వెంకట కృష్ణ కిరణ్, నుదురుపాటి వెంకటకృష్ణారావు స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని విశ్రాంత ఉద్యోగికి గాయాలు

ఒంగోలు టౌన్: ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో విశ్రాంత ఉద్యోగికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నగరంలోని హౌసింగ్ బోర్డులో నివాసం ఉండే సిద్దాబత్తుల సోమ శంకరరావు (85) అసిస్టెంట్ ట్రెజరర్‌గా ఉద్యోగం చేసి రిటైరయ్యారు. మంగళవారం ఉదయం టిఫిన్ కోసం స్కూటీ మీద వచ్చిన ఆయన తిరిగి వెళుతుండగా వేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీ కొంది. ఈ ప్రమాదంలో కింద పడిపోయిన సోమ శంకరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. ముక్కు, చెవి నుంచి రక్తం కారుతుండగా ఆయన స్పృహ కోల్పోయారు. స్థానికులు వెంటనే రిమ్స్‌కు తరలించారు. తలకు బలమైన గాయాలు అయినట్లు వైద్యులు తెలిపారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు ఆయనను ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రుడి కూతురు అమ్ముల రాధా రమణశ్రీ ఫిర్యాదు మేరకు వనటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని ఫిర్యాదు చేస్తున్నారు.

నోటీసులు ఉపసంహరించుకోవాలి

చీమకుర్తి: పట్టణంలోని 11వ వార్డులో వాగుపై కొంతమంది గిరిజనులు నిర్మించుకున్న ఇళ్లను తొలగించేందుకు మున్సిపల్ కమిషనర్ ఇచ్చిన నోటీసులను ఉపసంహరించుకోవాలని కేవీపీఎస్ రాష్ట్ర నాయకులు దుడ్డు వెంకట్రావు, గిరిజన సంఘం నాయకుడు పేరం శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గిరిజనుల ఇళ్లను తొలగించేందుకు రెడ్ కలర్‌తో మార్కింగ్ ఇవ్వడాన్ని నిరసిస్తూ తక్షణమే నోటీసులను ఉపసంహరించుకోకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

కుటుంబ కలహాలతో బాలిక ఆత్మహత్య


బావిలో మృతదేహాన్ని వెతుకుతున్న ఎస్సై శివనాంచారయ్య

కందుకూరు రూరల్: కుటుంబ కలహాలతో బావిలో దూకి బాలిక ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మండలంలోని కొండికందుకూరు బుద్ధా నగర్‌లో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన జి.ఆనంద్, యశోదల మధ్య సోమవారం రాత్రి గొడవ జరిగింది. దీంతో రెండో కుమార్తె అయిన లావణ్య (16) మనస్తాపం చెంది మంగళవారం ఉదయం బహిర్భూమికి అని వెళ్లి బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఉదయం వెళ్లిన కుమార్తె ఇంటికి రాలేదని కుటుంబ సభ్యులు వెతుకుతుండగా బావిలో చెప్పులు తేలాడుతున్నాయి. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బావిలో గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు. లావణ్య పదో తరగతి పరీక్షలు రాసింది. ఇంటర్మీడియెట్ చేరేందుకు గురుకుల పాఠశాలకు ఆదివారం ప్రవేశ పరీక్ష కూడా రాసింది. చదువులో కూడా తెలివిగా ఉండే లావణ్య ఇలా చేయడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

అతికష్టం మీద బయటకు

పాడుపడిన వ్యవసాయ బావి, అందులో చిల్లచెట్లు, కంప పడి ఉంది. బావిలోకి దిగేందుకు కూడా వీల్లేకుండా ఉంది. కందుకూరు రూరల్ ఎస్సై శివనాంచారయ్య సిబ్బందితో నిచ్చెన వేసుకొని బావిలోకి మునిగి మృతదేహాన్ని గాలించాడు. ముందుగా గజఈతగాళ్లు కావాలని భావించారు. గాలాలు వేసి తీయాలని ప్రయత్నించారు. కానీ వీలు కాకపోవడంతో ఎస్సై నీళ్లలో మునిగి మృతదేహాన్ని వెతికి బయటకు తీశారు.

నేటితో ముగియనున్న పది మూల్యాంకనం

ఒంగోలు: పదో తరగతి మూల్యాంకనం బుధవారంతో ముగియనుంది. ఈనెల 19 నుంచి ప్రారంభమైన మూల్యాంకం ప్రశాంతంగా జరిగింది. మంగళవారం నాటికి పదో తరగతి తెలుగు, సంస్కృతం, గణితం, ఒకేషనల్ కోర్సులకు సంబంధించిన సబ్జక్టుల మూల్యాంకనం పూర్తి చేశారు. మిగిలిన సబ్జక్టుల మూల్యాంకనం కూడా బుధవారంతో ముగించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

ఒంగోలు టౌన్: దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ప్రజా స్వామ్యాన్ని కాపాడుకునేందుకు ప్రజలంతా ఏకమవ్వాలని సీపీఎం, సీపీఐ నగర కార్యదర్శులు జి.రమేష్, పీవీఆర్ చౌదరి పిలుపునిచ్చారు. బీజేపని ఓడిద్దాం, దేశాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రచార భేరీలో భాగంగా మంగళవారం నగరంలోని కొత్త కూరగాయల మార్కెట్, సాగర్ సెంటర్, కొత్త పట్నం బస్టాండ్ సెంటర్, నెల్లూరు బస్టాండు సెంటర్లలో ప్రచారం చేశారు. నాయకులు మాట్లాడుతూ దేశ రక్షణకోసం ప్రతి వ్యక్తి నోరు విప్పి కేంద్ర పాలకులను నిలదీయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రజలు మేలుకోకపోతే భవిష్యత్తరాలు చీకటిమయం అవుతాయని హెచ్చరించారు. ఎందరో ప్రజలు పోరాటాలు చేసి, ప్రాణ త్యాగాలతో సాధించకున్న ప్రభుత్వరంగ సంస్థలను అడ్డగోలుగా అదానీకి కట్టబెడుతున్న మోదీ ప్రభుత్వానికి ఇంకెంత మాత్రం అధికారంలో కొనసాగే నైతిక అర్హత లేదని స్పష్టం చేశారు. కార్మికుల హక్కులను కాలరాసి, ఉపాధి హామీని నీరుగార్చి, అన్నదాతల వెన్నువిరిచి, ప్రజా హక్కులను పాతి పెడుతున్న బీజేపీ విధానాలు దేశానికి చేటు చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన హామీలను అమలు చేయకుండా, విశాఖ ఉక్కును అమ్మేయాలని చూస్తున్న మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు పోరాటాలు చేయాలని కోరారు. ఈనెల 27న ఒంగోలులోని అద్దంకి బస్టాండు సెంటరులో నిర్వహిస్తున్న బహిరంగ సభను విజవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు దామా శ్రీనివాసులు, తంబి శ్రీనివాసులు, టి.మహేష్, శ్రీరాం శ్రీనివాసులు, మారెళ్ల సుబ్బారావు, టీబీఎస్ రాజు, సయ్యద్ సర్దార్, ప్రకాశరావు, కొత్తకోట వెంకటేశ్వర్లు, అత్తింటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యుత్ పనులు ప్రారంభం


భూమి పూజ చేస్తున్న ఎంపీటీసీ మన్నె శ్రీనివాసరావు, సర్పంచ్ కోటేశ్వరరావు, లక్ష్మారెడ్డి

ఒంగోలు రూరల్: తీరప్రాంత గ్రామాల్లో విద్యుదీకరణ పనులు చేపట్టేందుకు పాత స్తంభాల స్థానంలో నూతన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లు, విద్యుత్ తీగలు ఏర్పాటు చేసేందుకు రీజనల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి రూ.5 కోట్లు విడుదల చేయించారు. ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినా, గాలి వీచినా ఎలాంటి ఆటంకం లేకుండా నిరాటకంగా విద్యుత్ సరఫరా కొనసాగేందుకు, ఆక్వా కల్చర్ దెబ్బతినకుండా ఉండేందుకు ఈ చర్యలు ఉపయోగపడ్డాయి. ఇదే సమయంలో మేజర్ పంచాయతీ అయిన కరవది గ్రామ పంచాయతీల్లో విరిగిపోయిన, దెబ్బతిన్న స్తంభాలను తొలగించివేసి నూతన స్తంభాలు వేయాలని, ఎత్తు పెంచాలని కరవది ఎంపీటీసీ రీజనల్ కోఆర్డినేటర్ బాలినేనిని కలిసి కోరినట్లు ఎంపీటీసీ మన్నె శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు స్తంభాలను నిర్మించేందుకు డ్రిల్లింగ్ మిషన్‌తో పనులు ప్రారంభం కార్యక్రమాన్ని, సర్పంచ్ డి.కోటేశ్వరావు, లక్ష్మారెడ్డితో కలిసి కొబ్బరికాయకొట్టి నిర్వహించారు. వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా పాత స్తంభాలతో ఇబ్బందులు పడిన కరవది గ్రామస్తులు ఎమ్మెల్యే సకాలంలో స్పందించి పాడుబడిన స్తంభాలను, వైర్లను, కండెన్సర్లను మార్పు చేయడంతో చిరుగాలికి కరెంటు పోయే పరిస్థితి తప్పిందన్నారు. ఈ సందర్భంగా కరవది గ్రామస్తులు బాలినేనికి రుణపడి ఉంటారన్నారు. ఏఈ ఆర్.ఆర్.చెన్నారెడ్డి మాట్లాడుతూ రూ.30 లక్షలతో పనులు ప్రారంభమయ్యాయని నాణ్యతపరమైన లోపాలు లేకుండా పూర్తి భద్రత కలిస్తూ వేగంగా పనులు పూర్తి చేస్తామని తెలిపారు. సచివాలయ కన్వీనర్లు కోటు వెంకట్రావు, తొట్టెంపూడి కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బాబురావు, విజయ్, పంచాయతీ సిబ్బంది నాగేశ్వరరావు, మిడసల కృష్ణ, అంకారావు, విద్యుత్ హెల్పర్లు మల్లిఖార్జునరావు, రమేష్ పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ వ్యవస్థ మరింత బలోపేతం కావాలి

- ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో పంచాయతీరాజ్ దినోత్సవం సదస్సు


వీరభద్రాచారిని సత్కరిస్తున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

ఒంగోలు అర్బన్: పంచాయతీరాజ్ వ్యవస్థను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత బలోపేతం చేయాలని నేషనల్ లోకల్ గవర్నమెంట్స్ చాంబర్ జాతీయ ప్రధాన కార్యదర్శి వీరభద్రాచారి అన్నారు. మంగళవారం ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సదస్సు నిర్వహించారు. దీనిలో ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ స్థానిక సంస్థలను స్వయంపాలన, స్వయం పోషకత్వంగా ఉండేలా ప్రభుత్వాలు తీర్చిదిద్దాలన్నారు. అనంతరం పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వీరభద్రాచారిని సత్కరించారు. దీనిలో సర్పంచ్‌లు, ఎంపీటీసీల సంగం నాయకులు నన్నెబోయిన శ్రీనివాసులు, పూనూరి సుబ్బారావు, బెజవాడ శ్రీరామమూర్తి, బట్టు రామారావు, కాసుల గురవయ్య, వంసతమ్మ, సుభద్రవ, మోహను, పోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.